క్లుప్తంగా

ఆర్థిక సాయం



గణేష్‌కు సాయాన్ని అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: వీరఘట్టం గ్రామానికి చెందిన గెంబలి గణేష్ విశాఖపట్నంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వైజాగ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్సకు రూ. ఐదు లక్షలు వరకు ఖర్చవుతోందని వైద్యులు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న మండలానికి చెందిన స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్ తమ వంతుగా ఎనిమిది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేశారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాలకు ఎంపిక

టెక్కలి రూరల్: ఉపకరణాల కోసం నియోజకవర్గస్థాయిలో దివ్యాంగుల ఎంపిక ప్రక్రియను స్థానిక తెంబూర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం చేపడుతున్నట్టు ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు ఆదివారం తెలిపారు. నియోజకవర్గం పరిధిలో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు గల దివ్యాంగులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని వారికి అవసరమైన ఉపకరణాలను పొందవచ్చునన్నారు. దివ్యాంగులు తమ ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఫొటోలతో పాటు యూడీఐడీ కార్డు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 83309 81418 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పది అడుగుల కొండ చిలువ హతం



చనిపోయిన కొండచిలువ

కంచిలి: దాకరాపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సమీప జీడి తోటల్లోకి పది అడుగుల కొండ చిలువ ప్రవేశించింది. అక్కడ మేకల మంద లోకి ప్రవేశించడంతో కాపర్లు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమై కర్రలతో కొట్టి హతమార్చారు. ళన చెందుతున్నారు.

అసిరిపోలమ్మకు పూజలు



పూజలందుకున్న అసిరిపోలమ్మ

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారికి దసరా ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 19న గ్రామానికి వచ్చిన అమ్మవారికి మూడోరోజైన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12 రోజుల పాటు అమ్మవారు పూజలందుకోనున్నారు.

ఎరువులు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



ఎరువుల సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న లోలాక్షి

కంచిలి: రైతుల ఎరువులు సరఫరా లేక అల్లాడుతున్నారని, వెంటనే స్పందించి తగినన్ని ఎరువులు ఇప్పించాలని కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కలిసి విజ్ఞప్తి చేశారు. కంచిలి మండలవ్యాప్తంగా రైతాంగానికి తగినంత ఎరువులు సరఫరా జరగలేదని, దీంతో రైతులు ఆర్‌బీకేలు, ప్రైవేటు డీలర్ల దుకాణాల వద్ద రోజులకొద్దీ క్యూలైన్లలో వేచి ఉంటున్నప్పటికీ ఫలితం లేకపోతోందని కలెక్టర్‌కు వివరించారు. అధికారులను అడుగుతుంటే టోకెన్లు ఇస్తున్నప్పటికీ కొద్ది రోజుల వరకు యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండలానికి ఇంకా అవసరమైన ఎరువుల అవసరాన్ని గణాంకాలతో ఆమె చెప్పి మంజూరు చేయాల్సిందిగా వేడుకొన్నారు.

వారం రోజుల్లో యూరియా రాక

సోంపేట: మండలానికి వారం రోజుల్లో మూడు వేల యూరియా బస్తాలు రానున్నాయని తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి ఆదివారం తెలిపారు. సోంపేట, పలాసపురం, ఎం.జి.పురం, సుంకిడి, పాత్రకొండ తదితర పంచాయతీల రైతులకు వీటిని అందజేస్తామన్నారు. వారం రోజుల్లోగా యూరియా చేరుకుంటే రైతులకు కొరత తీరుతుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు యూరియా వాడకం చేపట్టాలన్నారు.

లక్ష్యంనీరుగారింది!

- పూర్తికాని ఉద్దానం రక్షిత మంచినీటి పథకం ఫైపులైన్ పనులు
- గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం
- ప్రభుత్వ మారడంతో నిలిచిపోయిన పనులు



ఈదురాపల్లిలో ఏర్పాటు చేసిన కుళాయిలు



దానగురలోని ఓవర్ హెడ్‌ట్యాంకు

పలాస: లక్ష్యం నీరుగారింది. ప్రజలకు నీటి కష్టాలు తీరలేదు. గొట్టా బ్యారేజ్ నుంచి పైపులైన్ ద్వారా ఉద్దానం ప్రాంతానికి రక్షిత మంచినీటిని అందించి ప్రజల దాహార్తిని తీర్చడానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.700 కోట్ల వ్యయంతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును మంజూరు చేసి పనులు ప్రారంభించారు. గొట్టా బ్యారేజ్ నుంచి పైపులైన్ పనులు ఇచ్ఛాపురం వరకు జరగాల్సి ఉంది. పలాస, ఇచ్ఛాపురం వరకు ప్రారంభమైన పనులు తరువాత ప్రభుత్వం మారడంతో కొన్నిచోట్ల నిలిచిపోయాయి. పలాస మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 88 హేబిటేషన్ గ్రామాలు ఉన్నాయి. వీటిని ఈ పథకం ద్వారా 86 గ్రామాలకు నీటి సరఫరా కావలసి ఉంది. గత ప్రభుత్వంలో జలజీవన మిషన్ నిధుల ద్వారా ప్రధాన పైపులైన్ పనులు జరిగాయి. వీధుల్లో పలాస గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా రూ. 90 కోట్లతో ఇంటింటికి కుళాయిల పనులు జరగాల్సి ఉంది. అయితే కొన్ని గ్రామాల్లోనే పనులు జరగడంతో అక్కడ ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీరు సరఫరా అవుతుండగా కొన్ని గ్రామాలకు నీరు రావడం లేదు. పలాస మండలంలోని లొత్తూరు పంచాయతీ పరిధిలోని చింతవీధి, హల్దిగాం గ్రామాలకు నీటి సరఫరా జరగడం లేదు. అలాగే ఉద్దానం ప్రాంతంలోని మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి తదితర గ్రామాలకు కూడా నీటి సరఫరా కావడం లేదు. దీనికి కారణం కొన్ని గ్రామాలకు గతంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు పైపులైన్ అనుసంధానం లేకపోవడం, మరికొన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఉన్నా వాటికి ట్యాప్‌లు లేక పోవడం వంటి చిన్నచిన్న లోపాలతో లక్ష్యం నెరవేరకుండా పోయింది. హిరమండలం నుంచి 80 కిలో మీటర్ల పొడవున పైపు లైన్ వేశారు. ఆ పైపు లైన్‌ను ప్రతి గ్రామానికి అనుసంధానం చేశారు. ఓవరు హెడ్ ట్యాంకులు లేని గ్రామాలకు కొత్తగా ట్యాంకులు నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. అక్కడ నుంచి ప్రతి ఇంటికీ కుళాయిలను ఏర్పాటు చేసి ఓవరు హెడ్ ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. వాటి కోసం పలాస నియోజకవర్గానికి రూ. 90 కోట్లు నిధులు అవసరం ఉందని సంబంధిత అధికారులు ప్రతిపాదనలు వేయగా ప్రభుత్వం మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ కూడా పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు మంజూరై పనులు పూర్తయితే ఈ ప్రాజెక్టు ద్వారా మంచినీటి సరఫరా జరిగి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజల కష్టాలు తీరుతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా పలాస మండలంలోని మొత్తం 86 గ్రామాలకు గాను ప్రస్తుతం 42 గ్రామాలకు మాత్రమే ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. మిగిలిన గ్రామాలకు నీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో పెండింగ్ పనులు పూర్తి చేసి నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



పలాస మండలంలో ప్రతి గ్రామానికి పైపులైన్ వేశాం. ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు వెళ్తుంది. అయితే కొన్ని గ్రామాలకు ఇంటింటికీ కుళాయిలు వేయాల్సి ఉంది. ప్రభుత్వం వీటి కోసం ఇటీవల రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇప్పుడు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేష్, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పలాస

నీరు వృథాగా పోతుంది..



మా గ్రామానికి ఇంటింటికీ పైపు లైన్ వేశారు. అయితే నీరు ఎప్పుడు వస్తుందో తెలియదు. అయితే కుళాయిలకు ట్యాప్‌లు సరిగ్గా లేవు. దీంతో నీరు వచ్చేటప్పుడు లీకై వృథాగా పోతుంది. ఊరంతా చిత్తడి అవుతుంది. మెయింటినెన్స్ బాగు లేదు.

– బందారు గౌరమ్మ, మాకన్నపల్లి, పలాస మండలం

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ నిర్మించాలని కోరుతున్న సొండిపూడి యువత

మందస: సొండిపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని కేఎన్‌పీఎస్ అధ్యక్షులు మిస్క కృష్ణయ్య, టీడీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ బస్కల మురళి కోరారు. సొండిపూడి యువజన అభ్యుదయ సంఘం సభ్యులతో కలిసి ఆదివారం శ్మశానవాటికను సందర్శించారు. దీన్ని ఆనుకొని సునాముది గెడ్డ ప్రవహిస్తుండడంతో ఈ ప్రాంతం కోతకు గురవుతుంది. దీంతో ఎవరైన మృతి చెందితే దహన సంస్కారాలు నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రహరీ, ఆశ్రయం నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ శ్మశానవాటిక అభివృద్ధిని విస్మరించింది. ప్రహరీ నిర్మించాలని కోరుతూ అధికారులు, ఎమ్మెల్యే చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని సొండిపూడి యువత వాపోతున్నారు. తక్షణమే నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని కేఎన్‌పీఎస్ అధ్యక్షులు కృష్ణయ్య, టీడీపీ నాయకుడు బస్కల మురళి, సొండిపూడి అభ్యుదయ యువజన సంఘం సభ్యులు విద్యాసాగర్, రంజిత్, దినేష్, నరేష్ కోరారు.

ప్రైవేటీకరణ చేయడమే అభివృద్ధా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు భారతిదివ్య



మాట్లాడుతున్న భారతిదివ్య

ఇచ్ఛాపురం: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడమేనా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య ప్రశ్నించారు. పట్టణంలోని తన కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాకి ఒకటి చొప్పున 17 కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటీకరణ చేసి ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేయాలని చూస్తోందని అన్నారు. ఇదే జరిగితే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందక చాలా ఇబ్బందుల ఎదుర్కోవడం ఖాయమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటైజేషన్ వల్ల కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోవడంతో పేదవాడికి వైద్యవిద్య–వైద్య సేవలు అందుబాటులో ఉండవన్నారు. ఇది రాష్ట్ర ప్రజలకు కూటమీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ప్రజలకు ద్రోహం తలపెడుతున్న ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు ముందున్నాయన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి ఆదివారం పరామర్శించారు. జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం గ్రామానికి చెందిన బడ్డి సీతమ్మ, పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన మాదిన దిలీప్‌కుమార్‌లు ఇటీవల మృతిచెందారు. ఈ రెండు కుటుంబాలను నాయకులు ఆదివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతిరావు, నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, బెందాళం శోభన్‌బాబు, ప్రకాష్ చంద్ర పండా, శ్రీకాంత్ గౌడో, బడ్డి బాలరాజు, కర్రి బాలరాజు, కర్రి పున్నయ్య ఉన్నారు.

చీపురు పొదలతో ప్రమాదాలు..



పట్టుపురం వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయిర్ కాలువ మలుపులో ఏపుగా పెరిగిన చీపురు పొదలు

మెళియాపుట్టి: పర్లాకిమిడి నుంచి పలాస వెళ్లే ముఖ్య రహదారికి ఇరువైపులా మలుపుల్లో చీపురు పొదలు ఏపుగా పెరిగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పుట్టుపురం గ్రామం దాటిన తర్వాత ఆఫ్‌షోర్ కాలువ మలుపులో రహదారి కనిపించకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల మాకనాలపల్లి గ్రామానికి చెందిన పోమేశ్వరరావు అనే యువకుడు రాత్రి వేళ ద్విచక్రవాహనంపై వస్తూ.. అదే ప్రదేశంలో పొదల వలన రహదారి కనిపించక అదుపుతప్పి తుప్పల్లోకి వెళ్లి తీవ్రగాయాల పాలై ప్రాణాలు కోల్పోయాడు. దట్టమైన పొదల్లో మృతదేహం ఉండటం వలన మూడు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో బయటపడింది. పట్టుపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటే భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు రహదారికి ఇరువైపులా ఉన్న చీపురు పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

టెక్కలి: జిల్లా ప్రసూతి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రిమ్స్ ప్రొఫెసర్ ఆర్.అరవింద్ ఆధ్వర్యంలో ప్రసూతి వైద్యులు ధనలక్ష్మి, స్రవంతి, మౌనిక, తన్మయి, నాగలక్ష్మి, శేషశ్రీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, శానిటరీ నాప్‌కిన్స్ అందజేశారు. మహిళలకు ఎదురయ్యే వివిధ రకాల అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వార్డెన్ శ్రావణి ఉన్నారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో హెలికాప్టర్ రైడ్

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది హెలికాప్టర్ రైడ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సుధాకర్ ఆదివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, కె.అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సహకారంతో హెలికాప్టర్ రైడ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం నుంచి స్థానిక వంశధార హైస్కూల్‌లో టికెట్ల విక్రయం ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. వాతావరణం అనుకూలత బట్టి ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రైడ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజుకు గరిష్టంగా 40 ట్రిప్పులు మాత్రమే ఉండడం వలన 240 మందికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. టికెట్ ధర రెండు వేల రూపాయలుగా నిర్ణయించామన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న బాలికలు

టెక్కలి: ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం నుంచి బాలికలు, పురుషులకు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలను జిల్లా అధ్యక్షుడు వై.వెంకన్న చౌదరి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే విధంగా ఏటా కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం సంతబొమ్మాళిలో యువకులు ఆదివారం రక్తదానం చేశారు. సహాయ, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సంతబొమ్మాళి యువజన సేవా సంఘం స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా సేవా సంఘం సభ్యులు రక్తదానం చేయగా వారికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకట ఉజ్వల్, శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కూచెట్టి కాంతారావు, మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, సంతబొమ్మాళి యువజన సంఘం ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్, నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు కొయ్యిన మధు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

వలస ఉద్యోగుల విరాళం



కంచిలి మండలం మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెంది.. వివిధ దేశాల్లో ఉద్యోగులు చేస్తున్న పలువురు విరాళాన్ని అందజేశారు. ఉద్యోగరీత్యా దుబాయ్, ఇరాక్, ఖతర్, రష్యా దేశాల్లో ఉద్యోగులు చేస్తూ ఉపాధి పొందుతున్న యువత ఇక్కడ ఆశ్రమంలో వృద్ధులను ఆదుకోవాలని తలించారు. దీంతో నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను నిర్వాహకులకు ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. వీరికి నిర్వాహకులు గుర్ల రమేష్, మోహనరావులు ధన్యవాదాలు తెలియజేశారు.

–కంచిలి

క్రీడాకారిణికి సత్కారం



కవిటి మండలం మెళియాపుట్టుగకు చెందిన మొగలిపురి శృతి ఇటీవల చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ (రేస్ వాకింగ్) పోటీలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆమెను ఆదివారం కవిటిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్ తదితర సంఘ నేతల సమక్షంలో దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొగలిపురి ఢిల్లేశ్వరరావు, మొగలిపురి నాగేశ్వరరావు, మొగలిపురి కృష్ణారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

–కవిటి

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య వ్రతాలు



నీలమణిదుర్గ ఆలయంలో సామూహిక వ్రతాల్లో మహిళలు

కవిటి: పోలాల అమావాస్య సందర్భంగా ఆదివారం పోలేరమ్మ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కవిటి మండలంలోని వివిధ గ్రామాల్లో పిల్లాపాపలు చల్లగా ఉండాలని కోరుతూ పోలేరమ్మకు పూజలు చేశారు. కవిటిలోని పిరియావీధి గ్రామంలో వెలసిన నీలమణిదుర్గ (పాతపట్నం)అమ్మవారి ఆలయంలో అర్చకులు బి రాజేష్‌స్వామి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక పోలేరమ్మ వ్రతాలను ఆచరించారు.

గ్రామీణ రోడ్లు ఇలా..వెళ్లేది ఎలా?



డెప్పూరు గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న అరకబద్ర రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: చినుకు పడితే చాలు మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా కనిపిస్తుంటాయి. దీంతో ఆ రోడ్లపై వెళ్లేందుకు వాహన చోదకులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పల్లె పండుగ పేరుతో సంక్రాంతి నాటికి గ్రామీణ రోడ్లు తళతళమంటూ మెరిసి పోతుంటాయి అని చెప్పిన కూటమి ప్రభుత్వం చేతల్లో మాత్రం చేయలేదంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. అటు పాలకులు గానీ, ఇటు అధికారులు గానీ ఈ రోడ్ల దుస్థితిని పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.